మమత

శ్రీ "మురళీకృష్ణ"

"జీవిత యాత్రలో అరవై మైలురాళ్లు దాటి యింతకాలం సుదీర్ఘ ప్రయాణం చేశాక, 'జీవితం మిగిల్చిందేమిటా?' అని గతంలోకి చూచుకొంటే మిగిలిందిది తప్ప మరేంలేదు..." అంటూ ఏడెనిమిది మడతలతో దాదాపు చాలా వరకు మాసి చిరిగి పోయే దశలో వున్న ఓ ఉత్తరాన్ని కన్పించిన ప్రతి వ్యక్తికీ చూపుతుంటాడు సీతారామయ్య పంతులు.

సీతారామయ్య పంతులు పురాతనమైన లంకంత యింట్లో ప్రొద్దున్నే దివారాత్రాలకు ఒకే పర్యాయం వండుకొనేవాడు. వండిన ఆ వంటని, వూళ్లోని రామమందిరానికి తీసుక వెళ్లి, గంటవాయించి, దేముడికి చేయిచూపించి వచ్చేవాడు. సీతారామయ్యపంతులు జీవన భృతికిగాను వూరివారు చేసిన యేర్పాటు యిది. వండుకొన్న ఆ భోజనాన్ని యిష్టమున్న నాడు తినేవాడు. లేనినాడు లేదు. పోతే, దినంలో మిగిలిన కాలమంతా క్షణక్షణమూ గతాన్ని గుర్తుచేసుకొని తాను భాధపడడమేగాకుండా, యెదురయిన ప్రతి వ్యక్తికి తన బాధను పంచేవాడు. ఊళ్లోవాళ్లకి ఆయనంటే జాలి లేకపోలేదు. ఆయనపై సానుభూతి చూపకపోలేదు. కాని యెదుట పడిన ప్రతిమనిషినీ, కన్పించిన ప్రతి పర్యాయమూ నిలవేసి యింతక్రితం ఎన్నోసార్లు చెప్పిన చరిత్రనే మళ్లీమళ్లీ చెప్పడంతో కొన్నాళ్లకు వినేవారికి విసుగెత్తడం సహజం. సీతారామయ్య పంతులు ఎదుట బడితే, తమంతట తామే ప్రక్కకు తప్పుకొనేవాళ్లు. కానీ పంతులు వాళ్లను పిలిచి పలుకరించి, జీవితం తనకు మిగిల్చిందేమిటో వివరించడం మొదలు పెట్టేవాడు...

మనిషి కష్టాలలో వున్నప్పుడు తోటివారినుండి సానుభూతి ఆశిస్తాడు. ఆ సానుభూతి తన కష్టాల నేవిధంగానూ తప్పించకపోయినా కనీసం మనఃక్లేశాన్ని పోగొట్టి, కష్టాల నెదుర్కొనే ఆత్మస్థైర్యాన్నందిస్తుందనే భావంతో సానుభూతిని కోరుతాడు. తాను వూహించినంతగా సానుభూతి పొందనినాడు, తనకేర్పడిన కష్టాలకంటే కూడా, సానుభూతి లభించనందుకు మరింత దిగజారిపోతారు. కాని యెదుట వారినుండి ఆశించే సానుభూతికి కూడా ఓ హద్దుంటూ వుందని గుర్తించని నాడు మనిషి కేమాత్రం శాంతి లభించదు.

సీతారామయ్య పంతులును చూడగానే, యితరులు ప్రక్కకు తప్పుకోవడానికి ముఖ్యకారణం అతడు చెప్పే చరిత్ర వినలేకపోవడం కాదు—అంతా చెప్పిన తర్వాత ఎదుట వ్యక్తి నీతడు వేసే చిత్రమైన ప్రశ్న!

'సమాధానం తెలిసీ చెప్పకపోయావో, నీతల వేయిముక్కలవుతుంద'ని ప్రశ్నించే భేతాళుడి శవంలాగా, సీరియస్‌గా ఓప్రశ్న అడిగేవాడు——"తాను కొడుకును క్షమించాలా? అక్కర్లేదా?" అని. అవతలి మనిషి మౌనంగా వూరుకుంటే, జవాబు చెప్పేదాకా వదలి పెట్టేవాడుకాదు సీతారామయ్య పంతులు. అతడు చెప్పిన విషయమంతా వినేసరికి, కొడుకునతడు క్షమించవలసిన అవసరంలేదనిపిస్తుంది వెంటనే. అవూటే అతడితో అంటే వప్పుకొనే వాడుకాదు..... "నీకు తెలియదులే బాబూ! ఎంతజేసినావాడుకన్నబిడ్డ! పెంచిన మమకారం, కడుపుతీపి—ఎలాంటి తప్పునైనా మన్నించ మంటుంది. పసివాడివి, యీ బాధ నీకర్థం

గాదులే!'' అని మరేదో గొణుక్కొంటూ వెళ్లి పోయే వాడు.

అలాకాక, ... ''మీరు మీ అబ్బాయిని క్షమించాలి పంతులుగారూ! ఎంతైనా అతడు మీ కన్న బిడ్డ. అదీగాక కాలం మారింది. దానితోబాటు మనమూ మారాలి'' అని జవాబు చెపితే, వున్నట్టుండి ఉగ్రరూపం ధరించేవాడు...''నేను వాడిని క్షమించాలా? ఎవరి కోసం సర్వాన్నీ ధారవోసి, నాబహిఃప్రాణంగా పెంచానో వాడు 'నాకు తండ్రి అక్కర్లేదు పొమ్మను కొంటే' నేను మన్నించాలా? జీవితంలో అరవై పదులుదాటి, జవసత్వాలుడిగిపోయిన యీ వయసులో వాడు నాకు కల్గించిన వ్యధ నీవు గ్రహించలేవులేబాబూ!'' అనడమే గాకుండా, ''ఈ పరిస్థితి మీకూ వస్తేగానీ, నా మనఃక్షోభ అర్థంగాదు'' అని యెదుట వ్యక్తిని నిష్ఠూరమాడేవాడు. సీతారామయ్య పంతులు కిది నిత్యకృత్యం కాబట్టి, అతడి మాటలకు ఎవరూ బాధ పడేవారు కాదు....

...ఉద్యోగరీత్యా నేను ఆ వూరికివచ్చి దాదాపు రెండు మాసాలే అయినందున సీతారామయ్య పంతులు విషయంపూర్తిగా తెలియలేదు. ఎదురయిన నన్ను రెండుమూడు సార్లు అలవాటు చొప్పున నిలవేసి, తన హృదయంలోని బాధను వెల్లడించాడు కానీ, అతడు చెప్పే ఆవేశంలో విషయమేమిటో వివరంగా బోధ పడలేదు.

నేను అద్దెకుంటున్న గదిలో చేరి కొద్దికాలమే అయినా, యింటివారితో బాగా పరిచయమైంది. ప్రతిరోజూ సాయంత్రం స్కూలునుండి రాగానే, కొంత సేపు యింటి యజమాని విశ్వనాథంగారితో కబుర్లు చెపుతూ కాలక్షేపం చేయడం అలవాటయింది. విశ్వనాథంగారు ఆఊళ్లోకెల్లా సంపన్న గృహస్థు. వ్యక్తిగతంగా ఉదార స్వభావుడవటం మూలాన వూరివారికి 'తలలో నాలుక' లా వుండే వారు.....

...ఓరోజు సాయంత్రం స్కూలునుండి వచ్చాక గదిలో యేంతోచలేదు. వూరిచివరి కాలువ గట్టువైపు షికారు వెడదామని బయలు దేరాను. కాని వాతావరణం అనుకూలంగా లేనట్లు కన్పించింది. వెడితే, కొంత తడవులోపూర్తిగా తడిసి పోగలవు సుమా! అని ఉరుముల మెరుపులతో ప్రకృతి హెచ్చరించింది. ఆకాశం దట్టంగా మేఘావృతమయింది. వెడదామా? వద్దా? అనుకొనేంతలో విశ్వనాథంగారు పలుకరించారు. ఆ ''వర్షం వచ్చేలాగుంది మేష్టారు! షికారెళ్లే ప్రయత్నం సాగదు. ఇలా వచ్చి కూర్చోండి! కబుర్లతో కాలక్షేపం చేద్దాం!'' అని పిలవడంతో, వెళ్లి వరండాలో కూర్చొన్నాను.

సన్నగా వాన జల్లు ప్రారంభమయింది...

గ్రామపంచాయితీఎలక్షన్లు మొదలు—ఇంతో పాకిస్తాన్ యుద్ధంవరకూ ఏవేవో విషయాలు దొర్లాయి. మాటల మధ్యలో ఏదో ఒక అంశంపై సంభాషణ సాగిపోతోంది. ఇంతలో, రోడ్లో ఎవరితోనో గట్టిగా మాట్లాడుతున్న సీతారామయ్య పంతులు కంఠం విన్పించడంతో యిద్దరం రోడ్డువైపు చూచాము. డాక్టరు కోసం వర్షంలో హడావుడిగా పరుగెత్తుక వెళ్లే ఓవ్యక్తిని చేయిపట్టుకొని ఆపి, వుత్తరం చూపి, యేదో అడుగుతున్నాడు పంతులు....

సీతారామయ్య పంతులు గత చరిత్ర యేమిటో తెలుసు కోవాలన్న కుతూహలంతో, విశ్వనాథంగారిని చెప్పమని అడిగాను. పంతులుపై సానుభూతితో గాఢంగా నిటూర్చి, చెప్ప నారంభించారు విశ్వనాథం గారు........

''సీతారామయ్య పంతులు శుద్ధ శ్రోత్రియ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన వ్యక్తి. మరీగొప్పగా లేకపోయినా, ఏదో కొంత ఆస్తీ, పాస్తీ కలిగినవారికి లేకలేక పుట్టిన ఒక్కడే కొడుకు. నిప్పును కడిగి శుభ్రంచేసేంతటి ఆచార వ్యవహారాలు, నిత్యాగ్ని హోత్రాలు, వేళ తప్పని జపతపాలు—వీటిమధ్యపుట్టి పెరిగిన సీతారామయ్య పంతులులో చిన్నతనం నుండీ సనాతన ధర్మాలూ, నిష్ఠలూనియమాలూ జీర్ణించుకో పోయాయి. తల్లిదండ్రులు కుదిర్చిన సంబం

ధానికి మారుమాటాడకుండా, తలవంచడంతో ఓ శుభ ముహూర్తాన 'జానికమ్మ' అతడి జీవితాన్ని పంచుకొనింది. ఆవిడ పేరుకు తగినట్లుగానే అతిఓర్పు, వినయవిధేయతలు అన్నింటినీ మించి పూర్వాచార గౌరవం కలిగి వుండడంతో సీతారామయ్యను సంపూర్తిగా తృప్తిపరచగలిగింది. భార్యను ప్రాణ ప్రదంగా ప్రేమించి, అపురూపంగా చూచుకొనే వాడు సీతారామయ్య పంతులు.

చిలుకాగోరింకల్లాంటి కొడుకునూ కోడలునూ పెళ్ళయిన మరుసంవత్సరంలోనే జన్మించిన వారి వంశోద్ధారకుడి ముద్దుముచ్చట్లనూ చూడనోచని సీతారామయ్య తల్లిదండ్రులు అతి స్వల్పకాల వ్యవధిలోనే ఒకరి తర్వాత ఒకరు కాలంచేశారు. అప్పట్లో జానికమ్మ ఓదార్పే లేకపోతే, సీతారామయ్య పంతులు తిరిగి మామూలు మనిషి కాలేడేమో? అనేంతగా బాధ పడ్డాడు.

రెండేళ్లు గడిచాయి. కాలగమనం వలన, చాలా వరకు కుదుటబడి కాలం వెళ్లదీసేంతలో విధి మరోసారి సీతారామయ్య పంతులును చూచి వెక్కిరించింది. గర్భందాల్చిన జానికమ్మ, ప్రసవ సమయంలో నానా యాతన పడి, ఓ సూర్యాస్తమయం వేళ తనను నమ్ముకొన్న వారిని విడిచి, శాశ్వతంగా అస్తమించింది. ప్రాణ ప్రదంగా చూచుకొనే భర్తను, క్షణం విడిచి వుండలేని బిడ్డ రామమూర్తిని వదలి, జానికమ్మ కన్నుమూయడంతో సీతారామయ్యపంతులు చాలా క్రుంగిపోయాడు. భార్య స్మృతి చిహ్నంగా మిగిలిన పసిబిడ్డను తల్లీ తండ్రి అయి కొన్నాళ్లు పెంచాడు. కాని యింట్లో 'స్త్రీ' అవసరం తప్పనిసరయే సరికి పునర్వివాహం చేసుకోవలసి వచ్చింది. కేవలం పరిస్థితుల ఒత్తిడి చేత, అవసరం చేత పెండ్లి చేసుకొనడం వలన ద్వితీయ కళత్రాన్ని సరిగా ఆదరించలేకపోయాడు పంతులు. పైపెచ్చు గతించిన జానికమ్మనే పదేపదే తలచి బాధ పడడం, సవతి తల్లి యెలా పెంచుతుందోనన్న అనుమానంతో పసివాడైన రామ్మూర్తి పెంపకంలో ప్రతిదీ స్వయంగా కల్పించుకోవడం వీటితో సీతారామయ్య పంతులుకూ రెండవ భార్యకూ అభిప్రాయభేదాలేర్పడ్డాయి. దానికి తోడు ఆవిడకు భర్త అనుసరించే మూఢసనాతనాచారాలూ, నిష్ఠలూ నియమాలూ సరిపడేవికావు. వారిద్దరి మధ్య ఏర్పడిన పొరపొచ్చాలు రానురానూ 'చిలికి చిలికి గాలివాన అయినట్లుగా' రోజురోజుకు పెరిగాయి. తత్ఫలితంగా యిద్దరికీ సఖ్యత చెడి, అన్యోన్యత లేకుండా పోయింది. అలా కొంతకాలం గడిచింది. ఇతరులు వేలెత్తి చూపలేని కుటుంబ ప్రతిష్ఠకూ, అగ్నిహోత్రం లాంటి వాడని పేరొందిన సీతారామయ్య పంతులుకూ తీరని కళంకం తెచ్చే సాహసం చేసి, యెదురింట మేడ మీదున్న యువకుడితో ఓ అర్ధరాత్రి వేళ లేచిపోయింది ఆవిడ.

భార్య మరణంతోనే క్రుంగిపోయిన సీతారామయ్య పంతులు యీ అవమానంతో జీవచ్ఛవంలా అయ్యాడు. వీధిలో నలుగురి ముందూ నడవడానికి జంకి, యింట్లో నుండి కాలు బయటమోపకుండా గడిపాడు కొంతకాలం. అప్పట్లో అతడికి నిజంగా మతి చలించిందో లేక అతడి ప్రవర్తన లోకుల కావిధంగా అనిపించిందోకాని, 'సీతారామయ్యకు మతి చెడింద'న్నారు...........

చెప్పడం ఆపారు విశ్వనాథంగారు. లంక పొగాకు చుట్టల కట్టలో నుండి ఒకటి తీసి, వెలిగించారు.

ఇంత క్రితం సన్నగా ఆరంభమయిన వానజల్లు పెద్దదయింది. కుండలతో క్రుమ్మరించినట్లు ధారాపాతంగా కురవ సాగింది వర్షం.....గంట ఏడున్నర యింది. రోడ్డు వంక చూచి, 'ఇకయీపూట హోటలు కెళ్లి భోంచేసే ప్రాప్తి లేదేమో?' ననుకొనేంతలో, విశ్వనాథంగారు నా వూహను పసికట్టారు. "ఈ వర్షంలో హొటలు కేం వెడతారు మేష్టారూ? ఇక్కడే భోజనం చేయండి!" అని నా జవాబు కెదురు చూడకనే, "అమ్మాయ్! శారదా!" అని కేక వేశారు. మరు కొద్దిక్షణాలలో లోనుండి గాజుల గలగల; ఆ వెనువెంట గోడపై మనిషి కదిలే నీడ; తలుపు

నానుకొని కన్పించే ఆకుపచ్చని చీరచెరగు—శారద రాకను సూచించాయి.

"ఈ పూట మన భానుమూర్తి మేష్టారు యిక్కడే భోంచేస్తారని మీ అమ్మతో చెప్పమ్మా!" అని, సగంలో ఆపిన సీతారామయ్య పంతులు చరిత్ర మళ్లీ కొనసాగించారు నావైపు తిరిగి.

"........అలాంటి పరిస్థితిలో ఓదార్చేందుకు బదులు సీతారామయ్య పంతులుపై కోర్టులో వ్యాజ్యం వేశాడు జానికమ్మ సోదరుడు. సీతారామయ్యపంతులు పునర్వివాహం చేసుకొన్నందు వలన ఆస్తి మరో విధంగా ఖర్చు చేసేయగలడనీ, అంతేగాక మతిభ్రమించినట్లున్న ఆ స్థితిలో దుర్వ్యయం చేసేయగలడనీ—అందుచేత తన చెల్లెలుకు పుట్టిన బిడ్డ కన్యాయం జరుగగలదు కాబట్టి బిడ్డతో సహా ఆస్తిని తన కప్పగించవలసినదని అతడి వాదం. ఆస్తిపాస్తులు రాబట్టుకొనేందుకు మామూలుగా లోకంలో బంధువులనే వారెలా చేస్తారో, అతడూ అలా చేశాడు.

అప్పటికే తల మునకలుగా క్రుంగిపోయిన సీతారామయ్యపంతులు దీంతో రెచ్చిపోయాడు. ఎలాగైనా తన బిడ్డను వారికి చెందకుండా సంరక్షించుకోవాలని తాపత్రయపడ్డాడు. ఇరువురి మధ్యా పంతాలు,పట్టుదలలూ పెరిగాయి. కేసు చిన్నకోర్టుల నుండి పెద్దకోర్టుల కెగ్రబాకింది. ఆర్థికంగా యిబ్బందులు పడటం చేత కోర్టు ఖర్చులకుగాను ఆస్తిలో ఒకటొకటే అమ్మవలసి వచ్చింది. రెండేళ్లు సాగిన ఆకేసు చివరకు త్రోసి వేయబడింది. సీతారామయ్యపంతులు తన బిడ్డను తానే వుంచుకోగలిగాడు కానీ, వుంటున్న యిల్లు తప్ప మిగిలిన ఆస్తి హారతి కర్పూరంలా హరించుకుపోయింది.

'పువ్వులమ్మిన చోట కట్టెలమ్మలేక' ఐదేళ్ల బిడ్డను తీసుకొని యెక్కడో దూరదేశంవెళ్లిపోయాడు. ఎలా బ్రతికాడో ఏమో, ఎవరికీ తెలియదు. సుమారు సంవత్సరం క్రితం మళ్లీ యీ వూరికి తిరిగి వచ్చాడు. దాదాపు రెండు దశాబ్దాలు ఆలనా పాలనా లేకపోవడంతో పురాతనమైన యిల్లు చాలాభాగం శిథిలమయినది. వచ్చిన నాటినుండీ గతాన్ని యిదమిద్ధమని ఎవరితోనూ విపులంగా చెప్పలేదు. కాని ప్రతివారితోనూ, "కొడుకే జీవిత సర్వస్వమనుకొని పెంచితే, అతడు దగా చేశాడ"ని మాత్రం చెపుతూ, ఓ వుత్తరం చూపి యేదో ప్రశ్నిస్తూంటాడు....

దానా—దీనా తెలియ వచ్చిందేమిటంటే, ఏ కొడుకు కోసమైతే, గుండెలవిసిపోయే బాధలలో కూడా కోర్టుల చుట్టూ తిరిగి అనేక కష్టనష్టాల కోర్చి, ఆస్తి సర్వమూ అర్పించి, యెక్కడో దేశంకాని దేశంలో వలసపోయి పెంచి పెద్ద చేశాడో ఆ సుపుత్రుడు తండ్రిని కాదనుకొనే స్థితికి వచ్చాడు. కుల మతాలు, సనాతనధర్మాలు అక్షరాలా పాటించే సీతారామయ్యపంతులు అభిమతానికి విరుద్ధంగా—రామమూర్తి తాను ప్రేమించిన క్రిస్టియన్ అమ్మాయిని రిజిష్టరు మ్యారేజ్ చేసుకొంటానని పంతంపట్టాడు. సీతారామయ్యపంతులు పెంచిన మమకారంతో అనునయంగా నచ్చజెప్పాడు. తండ్రిగా శాసించాడు. కాని ఆయన మాట చెల్లలేదు. తండ్రి కావాలో, ఆవిడతో పెండ్లి కావాలో కోరుకోమని బెదిరించాడు చివరి అస్త్రంగా. అతడు రెండవదాన్నే కోరుకోవడంతో యిద్దరిమధ్యా మాటామాటా పెరిగి, స్వగ్రామానికి తిరిగి వచ్చేశాడు సీతారామయ్యపంతులు.

'తాను ఎలాంటి పరిస్థితులలోనయినా, ప్రేమించిన యువతినే పెండ్లాడ దల్చుకొన్నాననీ, తన అభిప్రాయానికి తండ్రి సమ్మతించనట్లయితే—ఆ తండ్రికీ కొడుకూ, కొడుకు కా తండ్రి లేనట్లేననీ,ఇకమీదట తమ మధ్య తండ్రీకొడుకులుగా ఎలాంటి సంబంధ బాంధవ్యాలు లేవనీ' వ్రాతపూర్వకంగా రామమూర్తి వ్రాసిన వుత్తరమే సీతారామయ్యపంతులు నలుగురికీ చూపెట్టి, జీవితం తననెలా దగా చేసిందో వివరిస్తూ వుంటాడు.........."

సీతారామయ్య పంతులు చరిత్ర అంతా వినేసరికి కళ్లు చెమ్మగిల్లాయి నాకు. అత డంటున్నట్టు జీవితం అతడిని దగా చేసిన మాట వాస్తవమే ననిపించింది.

సగంలో ఆరిపోయిన చుట్టను మళ్లీ వెలిగించే ప్రయత్నం చేశారు విశ్వనాథంగారు.......

వర్షం ఏమాత్రం తగ్గలేదు. పెద్ద పెద్ద జల్లులతో నిలుపు లేకుండా కురుస్తోంది...ఎక్కడో దూరంలో ఓ పిడుగు పడ్డ శబ్దం విన్పించింది.....

''అసలు కాలం ముదిరి, వెర్రితలలు వేస్తోంది మేష్టారూ! లేకపోతే, శుద్ధమైన బ్రాహ్మణవంశంలో పుట్టిన రామమూర్తి, కష్టనష్టాల కోర్చి పెద్దజేసిన తండ్రిని కాదనుకొని, కిరస్తానీ అమ్మాయిని రిజిష్టర్ పెండ్లి చేసుకొంటాడా చెప్పండి? మనుష్యుల బుద్ధులు, ఆలోచనలు మారి, కాలం మారేకొద్దీ ఋతుక్రమం కూడా మారిపోతోందేమోనన్న సందేహం కలుగుతోంది. కాకుంటే, వర్షం ఏమాత్రం కురిసే అవకాశం లేని యీ కార్తెలో యిలా అకాలంగా కుంభవృష్టి ఏమిటి మేష్టారూ?'' అన్నారు విశ్వనాథంగారు.

''కాలం మారుతోన్న మాట నిజమేనండీ! కాని కాలం మారవలసిన అవసరం కూడా వుంది. మనిషి నాగరికంగా రోజురోజుకూ ముందుకు వెడుతూ, మరింత సుఖంగా వుండడానికి తాను మారి, కాలాన్ని మార్చుతున్నాడు. కాని యిది ఒక్కసారిగా జరిగే పని కాదు. క్రమబద్ధంగా జరగాలి. అయితే యీలోగా యెక్కడో ఒకరూ, యిద్దరూ ఒక్కసారిగా మార్పు తేవాలని ప్రయత్నిస్తే అది దుఃఖదాయకంగానే అవుతోంది. ఎందుకంటే యిది సంధియుగం కాబట్టి...'' అన్నాను నాకు తోచిన విధంగా.

''ఏమిటో మేష్టారూ! మీ యువకతరం అభిప్రాయాలకూ, మా పూర్వతరం వారి అభిప్రాయాలకూ సామ్యం కుదరదులెండి!'' అన్న విశ్వనాథంగారి మాటలతో మా సంభాషణ ఆగిపోయింది, లోనుండి పిలుపు రావటం మూలాన.

''లేవండి మేష్టారవు! భోంచేదాం!'' అంటూ యింట్లోకి నడిచారు విశ్వనాథంగారు. మౌనంగా అనుసరించాను.

.......భోజనం చేస్తున్నంత సేపుకానీ, ఆతర్వాత గదిలో వచ్చి పడుకొన్న మీదటకానీ, నా ధ్యాస సీతా రామయ్యపంతులు జీవితం పైననే నిమగ్నమయింది. ఆయనపై జాలితోబాటు, ఏదో ఆత్మీయతలాంటి భావం నెలకొనింది నాలో..........

ఆ తర్వాత మళ్లీ రెండు మూడుసార్లు పంతులు కన్పించినపుడు, అలవాటు ప్రకారం ప్రశ్నించి జవాబు చెప్పమన్నపుడు మౌనం వహించడం తప్ప మరేం చెప్ప లేకపోయాను. ఏవిధంగా జవాబు చెప్పినా, పండి రాలి పోయేందుకు సిద్ధంగా వున్న ఆ వృద్ధ బ్రాహ్మణుడి మనఃక్షోభకు ఉపశమనం కలిగించలేనేమోనని!

* * *

అనుక్షణం వేగంగా పరిభ్రమించే కాలచక్రం ఎన్నో మార్పులు తెస్తూ, మరో రెండు వలయాలను పూర్తి చేసింది.

విశ్వనాథంగారి కుటుంబంతో నా పరిచయం అభివృద్ధి అయి, నేను వారింటి అల్లుడు కావడం, 'శారద' నా జీవితంలో ధర్మపత్ని కావడం, మేమిద్దరం క్రొత్త కాపురం పెట్టడం కాలం తెచ్చిన మార్పుల్లో ఒకటి............

....ఓరోజు వుదయం స్కూలుకు వెడుతుండగా, బజారు వీధి మలుపులో జనం గుమిగూడి వుండటం కన్పించింది. మానవ సహజమైన ఉత్కంఠ నాకాళ్లను అప్రయత్నంగానే అటువైపు నడిపించింది. ముందున్న జనాన్ని తొలగద్రోసుకొని, అక్కడి దృశ్యం చూసేసరికి గుండె ఝల్లుమంది. రోడ్డు మధ్యగా ఆగిన ఓ కారు, కారు ముందు చక్రాల వద్ద నెత్తురు మడుగులో పడివున్న సీతారామయ్యగారి దేహం!.....'దూరం నుండీ హారన్ మ్రోగిస్తున్నా విన్పించుకొనక, హడావుడిగా పరుగెత్తుతూ రోడ్డుదాటే ప్రయత్నం చేశాడనీ, ఎంత ప్రయత్నించినా తప్పించే వీలులేక పోవడంతో సీతా రామయ్యపంతులు కారుక్రింద పడ్డాడనీ' అక్కడ మూగిన జనం మాటల వలన తెలిసింది. సీతారామయ్యను గురించి యేదేదో చెపుతూ, వీలయినంత సాను

భూతి చూపుతూ నించున్నారు జనసమూహం. చెమ్మగిల్లిన కండ్లను తుడుచుకొని, సీతారామయ్య పంతులు శవాన్ని సమీపించాను. సగం నలిగిపోయిన చేతి వ్రేళ్లలో నుండి యేదో కాగితం గాలికి రెపరెప లాడుతూ కన్పించింది. అతడు రోజూ నలుగురికీ చూపెట్టే పాతవుత్తరంలా కన్పించకపోవడంతో, ఏమిటోనని, ఆత్రంగా తీసి చూచాను. ఆ క్షణంలో మెదడులో ఎన్నో ఆలోచనలు 'బహుశా వుత్తరం వ్రాసి, ప్రయత్నపూర్వకంగానే జీవితం అంతం చేసుకొన్నాడేమో' నని కూడా అనుమానం రాకపోలేదు.

కాని, అది సీతారామయ్యపంతులు తన కొడుకు రామమూర్తికి వ్రాసిన వుత్తరం. ఆశ్చర్యపోయి, పైన తారీఖు చూశాను. ఆరోజే వ్రాసిన వుత్తరం. అడ్రసు వుందేమోనని గబగబా యిటూ అటూ తిప్పి చూశాను. ఉహూ! లాభం లేకపోయింది. ఉత్తరం తీరికగా మళ్లీ చదువుకోవచ్చునని, మడిచి జేబులో పడేసుకొన్నాను.

ఇంతలో విశ్వనాథంగారు, గ్రామ పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు, పోలీసు సబ్ఇనస్పెక్టర్ యింకా మరికొందరు పెద్దలు చేరారు. విచారణలూ, సాక్ష్యాలూ వగైరా తతంగం పూర్తిఅయాక, శవదహనాని కేర్పాట్లు చేయబడ్డాయి. రామమూర్తి అడ్రసు ఎవరికైనా తెలుసేమోనని విచారించబడింది కాని ప్రయోజనం లేకపోయింది.

ఎలాగో ఆ సాయంత్రానికి, పదిమందీ చేరి సీతారామయ్య పంతులు దేహాన్ని పిడికెడు బూడిద చేశాము. కానీ, అందరి స్మృతిపథాల్లోనూ, అతడెప్పటికీ మెదులుతూంటాడేమో ననిపించింది. ఎవరో దగ్గర బంధువును పోగొట్టుకొన్నంత విచారం, అనుభూతి కలిగింది నాకు.

'ఉత్తరం పూర్తిచేసి, పోస్టాఫీసుకు వెళ్లి అక్కడే అడ్రసు వ్రాసి పోస్టు చేద్దామని త్వరత్వరగా వెడుతున్నాడేమో పాపం! హఠాత్తుగా కారు రావడం, కంగారులో యిటూ అటూ పరుగెట్టి, చివరకు లోకంతో ఋణం తీర్చుకొని వెళ్లిపోవడం జరిగింది.'

విచారణ సమయంలో అవసరమైనప్పుడు, ఆ వుత్తరాన్ని చూపి, మళ్లీ నావద్దనే వుంచుకొన్నాను, తీరికగా చూద్దామని.

.....రాత్రి గదికి చేరుకున్న తర్వాత, ఆ వుత్తరం తీసి చదివాను.......

"చిరంజీవి రామ్మూర్తికి మీ నాన్న సీతారామయ్య ఆశీర్వాదములు..

నీవు తండ్రి అక్కర్లేదనుకొన్నా, నిన్ను కని పెంచిన యీ ముసలి తండ్రి నిన్ను వదులుకోలేక పోతున్నాడు బాబూ! ఇన్నాళ్లూ మానసిక క్షోభతో గడిపాను కానీ, చివరకు ఓడిపోయాను.

తరతరాల నుండీ వస్తున్న సాంప్రదాయాన్నీ, కుటుంబ గౌరవాన్నీ కాదని కులాంతర వివాహం చేసుకొన్నావన్న కోపం సర్వాన్ని పోగొట్టుకొని, నువ్వే జీవిత మనుకొని పెంచిన తండ్రిని కాదనుకొన్నావన్న బాధ, పట్టుదలలూ, పంతాలూ—వీటన్నింటిని కడుపు తీపి, తల్లిలేని నిన్ను స్వయంగా పెంచిన మమకారం, ముఖ్యంగా తండ్రికి బిడ్డపై గల మమత—జయించాయి.

కాలం మారింది. ఆ సత్యాన్ని గ్రహించక మూర్ఖంగా ప్రవర్తించడం అవివేకం. లోకం కోసం కాకపోయినా, కన్నబిడ్డ తృప్తికోసం, సుఖం కోసం నేనూ మారాను బాబూ!

నిన్ను క్షమించగలిగాను. నీ కోసం అనుక్షణం తపించిపోయే యీ వృద్ధుడి చెంతకు రెక్కలు కట్టుకొని పరుగెత్తుకు వస్తావు కదూ!

—సీతారామయ్యపంతులు."

ఉత్తరం చదవడం పూర్తి చేయగానే, వేడి కన్నీటిబొట్టు జారిపడింది. పాపం ఎంత ఆసక్తితో,

ఆశతో యీ పుత్త్రరం వ్రాసి కొడుకు కోసం యెదురు చూశాడో? బ్రతికుండగా చూడడానికి నోచుకొనక పోయినా, మరణానంతరం కర్మకాండ జరిపేందుకైనా కొడుకు వచ్చే అవకాశం లేకపోయింది. ఉత్త్రరంలో అడ్రస్సైనా వ్రాశాడు కాదు.........

సీతారామయ్యపంతులు బ్రతికుండగా, అతడు నలుగురితో చెప్పున్నట్టు జీవితం అతడిని దగా చేసిన మాట నిజమే. జీవితమే కాక, విధి కూడా అతడిని దగా చేసిందేమో?' ననిపించింది నాకు.

ఆ తర్వాత చాలారోజులు సీతారామయ్యపంతులు స్మృతిపథంలో మెదిలినప్పుడెల్లా ఆత్మీయుడిని పోగొట్టు కొన్న బాధ కలుగుతూ వుండేది నాలో......

......ఆ నాటి నుండీ యిప్పటివరకూ నా కొక అనుమానం వేస్తోనే వుంది.....

'మతి చలించినట్లున్న ఆ పరిస్థితిలో సీతా రామయ్యపంతులు ఆత్మతృప్తి కోసం అలాంటి పుత్త్రరం వ్రాసి, చదువుకొని తృప్తి చెందాడా? లేక తనను కాదనుకొన్న కొడుకును మమతానుబంధం చేత నిజంగానే క్షమించగలిగాడా?.....'